క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌తో బీవీఎస్ రెడ్డి

లింగపాలెం : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సోమవారం గన్నవరం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు లింగపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

3న నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం: కే9 పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన కాపు సంఘం నూతన కార్యవర్గం ఈ నెల 3న ప్రమాణస్వీకారం చేస్తారని సంఘం గౌరవాధ్యక్షుడు, చార్టర్డ్ అకౌంటెంట్ దాకారపు కృష్ణ తెలిపారు. కార్యక్రమం గుర్వాయిగూడెంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తారని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, పోలవరం ఏఎంసీ మాజీ చైర్మన్ జెట్టి గురునాథరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు.

వినియోగదారుల శ్రేయస్సే బీఎస్ఎన్ఎల్ లక్ష్యం

పోలవరం రూరల్: అతి తక్కువ ధరలతో వినియోగదారులకు సేవలందించి వారి శ్రేయస్సే బీఎస్ఎన్ఎల్ లక్ష్యమని జిల్లా బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడు కరిబండి నాగరాజు తెలిపారు. సోమవారం పోలవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్‌కు బీఎస్ఎన్ఎల్ ద్వారా ఉచితంగా ల్యాండ్ ఫోన్, ఫైబర్ నెట్ కనెక్షన్ అందించారు. పోలవరంలో ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జేటీఓ సుధీర్ కృష్ణ, జీఈ బ్రహ్మానందం, నందమూరి వెంకటరమణ, టెక్నీషియన్ శ్యామ్ పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు సోమవారం రూ. 2,01,232లను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా భీమవరానికి చెందిన తుములూరి వెంకట రమణ మూర్తి రూ. 1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేయగా, దాతకు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి విరాళం బాండ్‌ను అందజేశారు. విజయవాడకు చెందిన పరిమి రంజిత్ కుమార్ రూ.1,01,116 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేయగా, దాతకు ఆలయ సూపరింటెండెంట్ కె.కిషోర్ విరాళం బాండ్‌ను అందించారు.

ఇఫ్టు డివిజన్ ఉపాధ్యక్షుడి సంతాప సభ

జంగారెడ్డిగూడెం: ఇటీవల మృతిచెందిన ఇఫ్టు డివిజన్ ఉపాధ్యక్షుడు ముప్పిడి అబ్బులు సంతాప సభ సోమవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. ఆయన మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ తదితరులు తెలిపారు. ఇఫ్టు డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కొయ్యలగూడెం: మండలంలో 40 చౌకదుకాణాలకు 24,466 స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఎన్.నాగరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగులతో, 6 నుంచి 15 వరకు డీలర్ల ద్వారా, 16 నుంచి 20 వరకు సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేస్తారన్నారు.

రెగ్యులర్ చేయాలని ఎన్ఎంఆర్‌ల వినతి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఏళ్ల తరబడి ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా పనిచేస్తూ భక్తులకు మెరుగైన సేవలందిస్తున్నారు. తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు దేవస్థానం ఉద్యోగులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. పలువురు ఎన్ఎంఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి.. వీడని దిగ్బంధం

- భద్రాచలం వద్ద తగ్గుతున్న గోదావరి నీటిమట్టం
- నాలుగో రోజు ముంపులోనే రహదారులు
- తప్పని పడవ ప్రయాణం



బోటుపై వేలేరుపాడు వస్తున్న రుద్రమకోట గ్రామస్తులు



నాటు పడవపై ప్రయాణిస్తున్న రేపాకగొమ్ము గ్రామస్తులు

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతోంది. సోమవారం ఉదయం 47.60 అడుగులు ఉన్న నీటి మట్టం రాత్రి 8 గంటలకు 42.90 అడుగులకు చేరింది. గోదావరి నీటిమట్టం తగ్గుతున్నా శబరి ఎగపోటు వలన వేలేరుపాడు మండలంలో అనేక గ్రామాలు ఇంకా వరద ముట్టడిలోనే ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో 26 గ్రామాలు నాలుగో రోజూ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే రహదారిలో మేళ్లవాగు, ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు ముంపులోనే ఉన్నాయి. దిగువనున్న కోయిదా, కాచారం, పేరంటపల్లి, టేకుపల్లి, తాళ్లగొంది, పూసుగొంది, టేకూరు, కట్కూరు, సిద్ధారం, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురు మామిడి, బోళ్లపల్లి, పాతనార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, తదితర గ్రామాలతో పాటు మరో తొమ్మిది గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. గోదావరి వరద నీటి మట్టాలు దోబూచులాడటం వలన ఆయా గ్రామాల గిరిజనులు ఉపాధి పనులు లేక ఇళ్లలోనే ఉంటున్నారు. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము, రుద్రమకోట, వెళ్లే రహదారులు ఇంకా నీటిలోనే ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము గ్రామానికి వెళ్లే రహదారి ఇంకా నీటమునిగే ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బోట్లపై ప్రయాణిస్తున్నారు.

ముంపులో పొలాలు

పోలవరం రూరల్: గోదావరి ఎగపోటు నీటితో పోలవరం ప్రాంతంలో నాట్లు వేసిన పొలాలు నాలుగు రోజులుగా నీటిలో నానుతున్నాయి. నాట్లు వేసిన కొద్ది రోజులకే గోదావరి వరద పెరగడంతో కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరి ఎగపోటు నీరు తన్ని పొలాలు ముంపునకు గురయ్యాయి. వరద పూర్తిగా తగ్గి మళ్లీ స్లూయిజ్ గేట్ల నుంచి గోదావరి నదిలోకి చేరితే తప్ప పొలాలు బయటపడే పరిస్థితి లేదు. ఒక వైపు ఎగపోటు నీటితో పాటు, అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు కొండవాగుల నీరు తోడుకావడంతో ముంపు మరింత పెరిగింది. నాట్లు వేసిన పొలాలు నీటి నుంచి బయటపడితే ఎలా ఉంటాయనేది చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు దెబ్బతింటే మళ్లీ వరినారు తెచ్చుకుని నాట్లు వేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

బై బై.. గణేశా!

- అట్టహాసంగా వినాయక నిమజ్జన వేడుకలు
- ఏజెన్సీలో హోరెత్తిన ఊరేగింపులు



కొయ్యలగూడెం: అంకాలగూడెంలో ఊరేగుతున్న గణనాథుడు



ద్వారకాతిరుమల: వినాయకుడి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్ల హోరు, యువకుల నృత్యాలతో బాణసంచా కాల్పుల నడుమ గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ద్వారకాతిరుమల లోని కొత్త బస్టాండ్ వద్ద, తూర్పు వీధిలో, యాదవ కాలనీలో నెలకొల్పిన గణనాథులను ఉత్సవ కమిటీల సభ్యులు క్షేత్ర పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. రాత్రి పంగిడిగూడెం లోని పోలవరం కాలువలో విగ్రహాలను గణేష్ నామస్మరణల నడుమ నిమజ్జన చేశారు. అలాగే స్థానిక దేవస్థానం హైస్కూల్ పక్కన, ఆళ్వార్ సదనంలో కమిటీల సభ్యులు భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

గణపతి బప్పా మోరియా..

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో సోమవారం గణపతి బొప్పా మోరియా... జై బోలో గణేష్ మహరాజ్‌కు జై అంటూ నినాదాలు చేస్తూ భక్తులు గణపతి ప్రతిమలను ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం గుబ్బల మంగమ్మ, జల్లేరు జలాశయంలో ఈ ప్రతిమలను నిమజ్జనం చేశారు. బుట్టాయగూడెం, ముప్పినవారిగూడెం, దొరమామిడి, రెడ్డిగణపవరం తదితర గ్రామాల నుంచి ఊరేగింపు నిర్వహించి వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన సమయంలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై దుర్గామహేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గణనాథునికి వైఎస్సార్ సీపీ నేత విరాళం

లింగపాలెం: లింగపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల ఉత్సవాలకు లింగపాలెం గ్రామానికి చెందిన రాష్ట్ర వైఎస్సార్ సీపీ నేత, మైత్రి డెవలపర్స్ అధినేత, దాత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి) రూ.50 వేలు విరాళాలను అందజేశారు. ఈ మేరకు బీవీఎస్‌రెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన అన్ని వినాయకుని విగ్రహ ఉత్సవాల వద్దకు వెళ్లి గణనాథుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు ఒక్కో దేవాలయంలో రూ.5 వేలు చొప్పున విరాళాలు అందజేశారు. ఉత్సవ కమిటీల వారు దాత బీవీఎస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు బి.ప్రభాకర్‌రెడ్డి, చిలుకూరి రఘునాథ్‌రెడ్డి, తగరం జయరాజు, రెడ్డి ప్రవీణ్, సత్తిబాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: వినాయక చవితి పురస్కరించుకుని గణనాథుల ఉత్సవాలు సోమవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. అంకాల గూడెం గంటా వారి వీధిలో గణనాథుని ఊరేగింపు కార్యక్రమం బాలల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన చేశారు. కొయ్యలగూడెం, బయ్యనగూడెం, కన్నాపురం, గ్రామాలలో గణేష్ ఊరేగింపు, నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

వేలేరుపాడు: మండలంలో ఉన్న రుద్రంకోట గ్రామంలో గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహా గణనాథునికి అర్చకులు తీర్థాల భాస్కరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుని చేతిలో లడ్డూ ప్రసాదాన్ని వేలంలో రూ.5 వేలకు తుంగా శ్రీనివాసు దక్కించుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం గోదావరి నదిలో నిమజ్జనానికి రుద్రంకోట గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

పలు చోట్ల అన్నసమారాధనలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గణపతి నవరాత్రులు ఆరో రోజు ఆయా ఉత్సవ కమిటీలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పలు మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలను వైఎస్సార్‌సీపీ యువ నాయకులు జెట్టి ఆదిత్య, కౌన్సిలర్ నేకూరి కిషోర్, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు ప్రారంభించారు. కార్యక్రమంలో దున్న శివ, ముప్పిడి జగదీష్, కడియం కిరణ్, కమిటీ సభ్యులు సిరిబత్తుల ఏసు, దూసూరి నాగరాజు, మడ్డి గణేష్, శ్యామలపల్లి రమణ, బొబ్బిలి స్వామి తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: తీన్మార్ డప్పులతో నృత్యాలు చేస్తూ గణనాథుని ఊరేగిస్తున్న భక్తులు



లింగపాలెం: వైఎస్సార్ సీపీ నేత, దాత బీవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులు



జంగారెడ్డిగూడెం: అన్నసమారాధనను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురునాథరావు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే బాలారాజును సన్మానిస్తున్న దినేష్, తదితరులు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన బగ్గి దినేష్ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఆయన స్వగ్రామమైన దుద్దుకురులో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తనను జిల్లా స్థాయి పదవికి ఎంపిక చేసినందుకు దినేష్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని దినేష్ అన్నారు. అనంతరం బాలరాజును దినేష్‌తో పాటు పలువురు నాయకులు శాలువా కప్పి మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మద్దు సతీష్, కోరం దుర్గారావు, గణేష్, శ్యాంకుమార్, సుభాష్, బీటీ కొండరాజు తదితరులు పాల్గొన్నారు.

జలయజ్ఞ ప్రదాతకు ఘన నివాళి



రావి ఆకుపై మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రం

జంగారెడ్డిగూడెం: జలయజ్ఞ ప్రదాత, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి శ్రీనివాసపురం తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు ఘన నివాళులర్పించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రాన్ని రావి ఆకుపై, పేపర్‌పై కత్తిరించి (చిత్రించి) ఘనమైన నివాళి అర్పించారు. ప్రజల క్షేమం కోసం రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషి నేటి తరంతో పాటు, భావితరాలకు కూడా ఆచరణీయమని అన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

కొయ్యలగూడెం: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు కొయ్యలగూడెంలో మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు తెలిపారు. కొయ్యలగూడెంలోని మహా నదుల గ్రహం వద్ద వర్ధంతి సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు యువత నాయకుడు నూకల రాము పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, వైఎస్సార్ సీపీ అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: మధ్యాహ్న భోజనం కార్మికులకు జీతాలు పెంచాలని, గ్యాస్ సరఫరా చేయాలని, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ జిల్లా ఆరో మహాసభ జంగారెడ్డిగూడెంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు పసల సూర్యారావు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు లక్ష్మి, సీహెచ్ విజయకాంత, నరసమ్మ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కమిటీల అధ్యక్షుల నియామకం



నూతన కమిటీ అధ్యక్షులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శిగా పారేపల్లి నాగార్జున, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సిర్రా రాజేష్, పంచాయతీ రాజ్ అధ్యక్షుడిగా పత్తిపాటి రాజారావులు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు వారు తెలిపారు. తమకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి గురునాథరావు, జిల్లా అధ్యక్షుడు డీఎన్ఆర్, మండలాధ్యక్షులు ఓరుగంటి నాగేంద్రకుమార్, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాసరావు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన వారిని శ్రీనివాసపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు పోల్నాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పోల్నాటి ప్రసాద్, చల్లగాలి ఏసు, వసంతాటి శివాజీ, పారేపల్లి నరసింహారావు, ఎలికే సత్తిబాబు, తానిగడప రాజశేఖర్, పోల్నాటి ప్రభాకర్‌రావు తదితరులు సత్కరించారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం–మైసన్నగూడెం రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్ ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రధాన రహదారిగా ఉన్న శ్రీనివాసపురం, మైసన్నగూడెం, ములగలంపల్లి ప్రధాన రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను ప్రచారం చేసుకునేందుకే తప్ప హామీల అమలకు కృషి చేయడం లేదన్నారు. తక్షణమే రహదారిని నిర్మించాలని వారు కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

చింతలపూడి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. చింతలపూడి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి చేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జూపూడి వసంత, కొలుకు పాము శ్రీను, చంద్రు కష్ణ, బజార్ కష్ణ, వెంకటరమణ, మాదాసు రాజారావు, కొమ్మన గోపి తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ యూనివర్సిటీ నుంచి పీజీ

పోలవరం రూరల్: మండలంలో చిన్నపిల్లల వైద్యులుగా ప్రసిద్ధి గాంచిన డాక్టర్ గుణశేఖర్ అమెరికన్ యూనివర్సిటీ నుంచి (పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ పీడియాట్రిక్ న్యూట్రిషన్) ఉత్తీర్ణత పత్రాన్ని పొందారు. ఈయన పోలవరం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు వినయ్‌మెహతా, ఎండూరి రామకృష్ణ తదితరులు అభినందించారు.

విజయవాడకు తరలి వెళ్లిన ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా సీపీఎస్‌పై నిర్ణయం తీసుకుంటామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు అన్నారు. కాని అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని మరిచిందన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ నిర్వహించే ఛలో విజయవాడ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం, ఏజెన్సీ ప్రాంతం నుంచి సుమారు 100 మంది ఉద్యోగులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో టి.రవిప్రసాద్, ఎం.ధర్మరాజు, టి.గంగముత్యం, పవన్, సంతోషి, శ్రీనివాసరావు, రఘు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి: వెలగలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో వెలగలపల్లి ఏజీఎల్, యర్రంపల్లి ఏజీఎల్ ఫీడర్లకు ఈ నెల 2వ తేదీ మంగళవారం ఆర్‌డీఎస్ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల నిమిత్తం మంగళవారం శెట్టివారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో వెంకటాద్రిగూడెం ఫీడర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో రేచర్ల 24 గంటల ఫీడర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. కావున ఆయా ఫీడర్ల పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.